# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు.
- ❖ వ్యవసాయ యంత్ర సామాగ్రిపై జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
- ❖ పేదలందరికీ గృహ సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పక్కా ఇళ్ల పథకాన్ని చేపట్టిందని మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఈరోజు అస్సాంలోని బార్సపరా స్టేడియం వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది.
- ❖ రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

===========================

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి పూర్వోదయ పథకం కింద నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి సమావేశమై ఈ అంశంపై వినతి పత్రం సమర్పించారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పై కూడా దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రణాళికలను ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ కు అందించానని చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ లో వెల్లడించారు. నిర్మలా సీతారామన్ తో సమావేశం అనంతరం కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీ.ఆర్. పాటిల్ ను కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ తో కలిసి సీఐఐ భాగస్వామ్య సదస్సులో కొద్ది సేపటి క్రితం పాల్గొన్నారు.

===========================

వ్యవసాయ యంత్రాల పరికరాలపై జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సూపర్ జీఎస్టీ ప్రచారంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. పన్నులు తగ్గించడం వల్ల మధ్యతరగతి, సామాన్య ప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతోందని ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ...

(వాయిస్ 24 సెకన్లు)

===========================

అర్హులైన ప్రతీ పేదవాని సొంతింటి కలను నెరవేర్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకెళ్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలో కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఈరోజు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో అందరికీ పక్కా ఇళ్ల పథకాన్ని చేపట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతిపేదవాడికి ఇంటి పట్టా ఇచ్చి ఇళ్లు కట్టించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

===========================

రాజమహేంద్రవరం – తిరుపతి మధ్య అలయన్స్ ఎయిర్ కొత్త విమాన సర్వీసు రేపటి  నుండి ప్రారంభం కానుంది. ఈ ప్రారంభోత్సవానికి పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ నూతన సర్వీసుతో ప్రజలు ఇకపై త్వరగా రాజమహేంద్రవరం – తిరుపతి మధ్య ప్రయాణించగలుగుతారు.

===========================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 100 సెకన్లు)

===========================

మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఈరోజు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ప్రపంచ కప్ లో భాగంగా తొలి మ్యాచ్ అస్సాంలోని గౌహటి బార్సపరా స్టేడియం వేదికగా జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన శ్రీలంక జట్టు బౌలింగ్ ఎంచుకుంది. ప్రారంభంలో వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్ ను 48 ఓవర్లకు కుదించారు. దీంతో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 23 ఓవర్లు పూర్తయ్యే సరికి రెండు వికెట్లు నష్టపోయి 103 పరుగులు చేసింది. ఇక ఈ టోర్నమెంట్ లో మొత్తం 8 జట్లు పోటీ పడుతున్నాయి.

===========================

ఉత్తర కోస్తాంధ్ర పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అదే విధంగా ఉత్తర అండమాన్ సముద్రంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో బంగాళాఖాతం మధ్య ప్రాంతాలలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది

అక్టోబర్ 2న పశ్చిమ వాయువ్య దిశగా కదిలి వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని.. దీని ఫలితంగా రేపటికి సంబంధించిన వర్ష సూచనలను వాతావరణ శాఖాధికారిణి జీ. లక్ష్మి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

============================

విజయనగరం జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు. దత్తిరాజేరు మండలంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ లతో కూడిన మంత్రుల బృందం ఈ రోజు పర్యవేక్షించింది.

============================

============================